# ప్రాణవల్లభ

"ఇంతకూ తప్పంతా నాదేనంటారు." అన్నది సరస్వతి సజలనయనాలతో యెలుగు రాపడగా.

"హూ..." విదిలించివేశాడు ప్రకాశరావు.

"మీరు ఆలోచించలేరా..." ఎంతో ప్రాధేయపూర్వకంగా అన్నది సరస్వతి.

అతడు యేమాత్రమూ చలింపలేదు. అసలు చలింపదలచలేదు.

"నేనిక్కడ వుండలేను." యేడుపుని దిగమింగుకుంది.

"మంచిది."

ఆమె అభిమానం దెబ్బతిన్నది.

ప్రకాశరావుకి రాధవద్దనుండి ఆ ఉత్తరం వచ్చినప్పటినుంచి యేమీ బాగులేదు. ఎవరో తన గొంతు నులిమివేస్తున్నట్లు బాధపడ్డాడు.

రాధ యేమీ నిష్ఠూరంగా వ్రాయలేదు. అలా వ్రాసినా మనస్సుకి కాస్త శాంతిగా ఉండేది. రాధ యెంతమంచిది. ఆ విషయం మనస్సులోకి వచ్చినప్పుడల్లా సరస్వతిపైని యేవగింపు కలుగుతోంది. రాధ వ్రాసింది! "వదిన యేమంటోందన్నయ్యా. ఆమెకి నమస్కారాలు చెప్పు. నువ్వేం బాధపడకన్నయ్యా, నాకు నయమవుతుంది. భగవంతుడే వున్నాడులే—" ఇంకా ఇలానే యేమిటో దిగులు దిగులుగా వ్రాసింది. అంతదూరాన్నుంచి ఇంత చల్లగా యెలా

వ్రాయగలిగిందాఅని ప్రకాశరావు ఆలోచించాడు. "ఇక్కడికి రావొద్దు"-అని స్పష్టంగా వ్రాసినప్పటికి రాధ యేమాత్రం నిష్ఠూర మాడకపోగా యెంతసౌమ్యంగా వ్రాసింది?

ప్రకాశరావుకి అందుకనే మనసులో దుఃఖంగా వుంటోంది. 'నీకు విశ్వాసం లేదురా' అని చెల్లెలు నిష్ఠూరంగా వ్రాసివుంటే అతడు మనసు నింతకష్టపెట్టుకునేవాడు కాదు.

రాధ కేమిటోజబ్బు. ఏడాదినుంచి బాధపడుతోంది. డబ్బుంటే అంతబాధ ఉండకపోను. అందుకే ఆమె కిమ్మనకుండా ఆబాధ భరించాల్సి వచ్చింది. ఆమె ఎలాగో తెగించి తనకుతాను నచ్చచెప్పుకుని ప్రకాశరావుకి ఉత్తరం వ్రాసింది. రాధకి చిన్ననాటినుంచి తల్లిలేదు. పెద్దతండ్రికొడుకు ప్రకాశరావు. చిన్నప్పటినుంచి తనతోపాటే తండ్రిదగ్గర చదువుకున్నాడు. పెద్దవాడైనాడు. ఆమె యెలాగో వ్రాసింది.

ఆమెజబ్బు యేమిజబ్బో తెలియదు.

కొంతమంది క్షయ అన్నారు.బంధువులలో తెలియకుండా వుంటుందా? ఆ విషయం సరస్వతిదాకా వచ్చింది. ఆమె'అయ్యోపాపం, అనుకుంది.

ప్రకాశరావు అడిగినప్పుడు "పోనిద్దురూ...మెదలకుండా వూరుకోండి. ఆమెరాదు" అని సలహా చెప్పింది.

"అది మంచిదికాదు" అన్నాడతను.

"అయితే రావొద్దని వ్రాయండి."

అతడి బాధాకరమైన ముఖ కవళికలనుచూసి"ఏమిటో సొంత చెల్లెలైనా కాదు..." అని పైకి జార్చేసింది, లోపల అనుకోవలసిన మాటలను.

"అంతగా అభిమానమైతే వొందరూపాయలు పంపించండి. క్షయ మంచిజబ్బు కాదు.''

ప్రకాశరావుకి వొళ్ళు గగుర్పొడిచింది. వెంటనే అతడికళ్ళు చెమ్మగిల్లాయి.

సరస్వతి యెన్నో ఉదాహరణ లిచ్చింది. క్షయవ్యాధి యెంత భయంకరమైనదో వర్ణించింది. ప్రకాశరావు కెటూ పాలుపోలేదు.

ఎంతో కష్టపడి ఇక్కడకు రావద్దు అనే సూచ్యార్థంతో ఉత్తరం వ్రాశాడు చెల్లెలికి. అతడు నిజంగా బాధకూడా పడ్డాడు. అతడి మనసు యెంతో ఆరాటపడింది. ఫస్టుఫారంనుంచీ తాను పినతండ్రి వద్ద వుండి చదువుకున్నాడు. ఇవాళ తన అభ్యున్నతికి ముఖ్యకారకుడు పినతండ్రి. ఆయనకు వొక్కగానొక్క కూతురు. ఆమె నోరు తెరచి 'నేను నీదగ్గరకువచ్చి వుంటా నన్నయ్యా,కొన్నాళ్ళపాటు' అని వ్రాస్తే తానువద్దనే వ్రాశాడు. అతడికి సరస్వతిమీద బాగా కోపమే వచ్చింది. అయితే అతడూ మానవమాత్రుడే.మానవ సహజమైన బలహీనతల కతడేమీ అతీతుడు కాలేదు.

రాధ మళ్ళీ ఉత్తరం వ్రాయలేదు.

చాలారోజులు తరువాత ఇన్నాళ్ళకు ఉత్తరం వ్రాసింది. ఆ ఉత్తరం అతడి హృదయంలో విషాదం తెచ్చిపెట్టింది. ఆవాళ సరస్వతి సలహామేరకు తాను కొంత డబ్బు పంపించివున్నా బావుండేది. కాని అలా పంపించలేదు. అసమర్థతవల్ల కాదు; అభిమానంవల్ల. 'నేనువచ్చి నీదగ్గర కొన్నాళ్ళపాటు వుంటాను' అని ఆమె వ్రాసినప్పుడు 'వద్దు' అని తానువ్రాస్తూ డబ్బు పంపిస్తే ఆమె యెంతగా నొచ్చుకుంటుందో అని శంకించాడతను. ఎంతగానో ఆలోచించాడు కాని డబ్బు యేమాత్రమూ పంపించలేక పోయాడు. భయంలాంటి, సంకోచంలాంటి అభిమానం అతణ్ణి డబ్బైనా పంపనివ్వలేదు. అతడు

డబ్బూ పంపించలేదు. సరస్వతి తరువాత వొక్కమాారైనా పెచ్చరించకపోగా, రాధగురించి ఆమె క్షేమసమాచారం గురించి అడగనైనా అడగలేదు. ఇవాళ రాధ ఉత్తరం వ్రాసింది మద్రాసునుంచి. ఏదో అపరేషను చేశారుట. త్వరలోనే తగ్గిపోతుందట. క్షయ అని తాను చాలా భయపడిందట. కాని క్షయకాదుట. తనపిల్లలు అదృష్టవంతులే. ఇంకొక్క నెలరోజులు ఆస్పత్రిలో వుంటే ఇంటికి వెళ్ళవచ్చునన్నారుట డాక్టర్లు. 'భగవంతుడు వున్నాడులే'-అని వ్రాసింది. ఇంతవరకైతే ప్రకాశరావుకి ఇంత బాధ వుండేదికాదు. ఇంతకంటే విషాదకరమైన సంగతి వొకటి వ్రాసింది. దాని సారాంశం ప్రకాశరావుని తల్లక్రిందులు చేసివేసింది. అసలురాధే అంతఇదిగా వ్రాసింది. బాబాయి ,కూతురికోసం వున్న వొక్కగానొక్క ఆధారాన్నీ-ఇల్లుని నాలుగొందలు తక్కువగానే అమ్మేసుకున్నాడుట. నాలుగువందలు రాధకిచ్చాడుటపోయి. రాధ వ్రాస్తుంది. "ఆయన గతేం కాను అన్నయ్యా. ఎంత అభిమానస్తుడో నువ్వెరుగుదువుకదా—నేను యెన్నింటికి తల బద్దలు గొట్టుకునేదన్నయ్యా-—అవునుమరి నేను ఇన్నాళ్ళనుంచీ రోగం యెందుకు పెరబెగట్టుకున్నాను, డబ్బు లేకనే గదా — ఆయన సంపాదన నీకు తెలుసు. అందుకనే విధిలేక నాన్నకు వ్రాశాను. నాన్న ఇంతపని చేస్తాడనుకుంటే వ్రాయకపోయేదాన్ని. నేనే చచ్చిపోయేదాన్ని. కసికొద్దీ అంటున్నమాటే అనుకో. ఏమిటో తెలీకుండా వుంది. ఆయన పల్లెత్తి వొకరితో ఒక్కమాట చెప్పుకోడు. వచ్చాడు. డబ్బు ఇచ్చాడు. చాటుగా కళ్లు తుడుచుకుని వెళ్ళిపోయాడు. భగవంతుడున్నాడులే అన్నయ్యా-ఈ కష్టాలు యిలా యెప్పుడూ వుండవు. వదినని అడిగానని చెప్పు" అని వ్రాసింద.

ఈ ఉత్తరం చూసినతర్వాత ప్రకాశరావుకి తన అల్పత్వం, మరీ మాటాడితే క్షుద్రత్వం, యెంతటిదో అర్థమైంది. అందుకనే వచ్చీ రాగానే అతడు సరస్వతిపైని మండి పడ్డాడు.

ఆమె అభిమానంతో.-

"నే నిక్కడ వుండలేను" అన్నది.

"మంచిది" అన్నాడతను.

"అయితే నన్ను సాయంకాలం రైలుకే మాఊరు పంపించి వెయ్యండి" అన్నది.

"నేను పంపించటమేం. వెళ్ళదలచుకున్నదానివినువ్వేవెళ్లు..." అన్నాడతను.

"ఎందుకు యెలానూ విడిపోతున్నాం గనుక, విడిపోయే ముందు సఖ్యంగానే విడిపోదాం. ఎలాగూ మళ్ళీ కలుసుగుంటామో లేదో..."

"మంచిదిఅన్నాడతను యేమీ అనలేక. ఈ బెదిరింపు లిది" వరకు చాలామాట్లు జరిగాయి. అయితే అది క్రియారూపంలో యీ సారి పరిణమించబోతున్నది. అతడీసారి ఆమెను యెట్టి పరిస్థితులలోనూ క్షమించ దలచుకోలేదు. ఆమాచేపైకి అనేశాడు.

"అసలు నేనేం తప్పుచేశానని? క్షమాపణ ప్రసక్తిరానేరాదు" అని ఖండితంగా చెప్పింది ఆమె.

అతని కామాటలు మరీకోపంతెప్పించాయి.

ఇంతజరిగీ ఆమె కించిత్తూ బాధపడటంలేదు. జీవితపు విలువలు ఆమెకు తెలియవేమో - లేక ఆమెదృష్టి కుటిలమైనదా—అనుకున్నాడతను. ఆమెతో మాట్లాడటమే అతనికిష్టంలేదు. ఆమెకు అత

డితో మాట్లాడాలని తహతహగానూ వుంది. ఆమె ఆ సాయంకాలం రైలుకి వెళ్ళటం యెలాగూ నిశ్చయింపబడింది. చిత్రమేమిటంటే అతడే రైలు యెక్కించాలట. అతడు వొప్పుకున్నాడు. అమెలన్నది. "ఇలాటి పరిస్థితుల్లో మీతోకలసి జీవించలేను. ఏనాటికైనా మళ్ళీ కలసి జీవించగలమని ఇద్దరికీ తోచినప్పుడు మళ్ళీ కలుసుకుందాం." అంది."మంచిది" అన్నాడతను:

సాయంకాలమైంది. స్నో సీసాతోసహా, దువ్వెనతోసహా, తన వస్తువులన్నీ సర్దుకున్నదామె. అతడు నిర్లిప్తుడుగా వుండిపోయాడు. అతడికీ బాధగానే వుంది. అయితే అభిమానం అడ్డువస్తోంది.

తీసుకువెళ్ళి రైలు యెక్కించాడు

ఆమెకళ్ళు చెమ్మగిలటం అతడు కనిపెట్టగలిగాడు. అక్కడ యేమీ మాట్లాడలేకపోయినాడు. అతడికళ్ళూ చెమ్మగిల్లాయి. అది ఆమె కనిపెట్టటం అతడికిష్టంలేదు అందుకని రైలు బయలుదేరటానికి ఇంకా గంట ఆలస్యమున్నా అతడు వెళ్ళిపోవటానికి కుద్యుక్తుడైనాడు. ఆమె తలవంచుకుని అస్పష్టస్వరాన "ఇంకా కాసేపు వుండకూడదా," అన్నది. మామూలుగా వుండలేననితోచి అతడు బయలుదేరాడు. పోతూ పోతూ వెనక్కు తిరిగిచూస్తే ఆమె మొహం పాలిపోయివుండటం అతడికి స్పష్టంగా కనపడింది అతడు నేరుగా ఇంటికి వెళ్లి అద్దంలో తనముఖం చూసుకున్నాడు. తనముఖమూ అలానే వుంది. అలావుండటం అతడికిష్టంలేదు. అందుకని బాగా సబ్బుపెట్టి ముఖం కడుక్కున్నాడు. తరువాత మళ్ళీ చూసుకున్నాడు. అలానే వుంది.

దువ్వెన తీసుకుని దువ్వుకోబోయాడు. దువ్వెన కనిపించలేదు. ఇల్లంతా బావురుమంటూ కన్పించింది, ఆ నిశ్శబ్దాన్ని ఆ నాల్గు

క్షణాలే భరించలేకపోయాడు. ఇల్లంతా కొత్తగావుంది. అతడి హృదయంలో భయమూ, బాధా యేవగింపూ ఏదో తెలియని కొత్త అనుభూతి పీడిస్తున్నాయి.

తాళం వేసుకుని బజారునపడ్డాడు. ఎటుపోవటానికీ తోచింది కాదు. పోయి పార్కులో కూర్చున్నాడు. ఎంతసేపో కూచోలేదు. ఏమీ తోచలేదు. ఆ రైలు వెళ్ళిపోయివుంటుంది. అని చెప్పుకున్నాడు. అలా చెప్పుకోగానే అతడికేమిటో దిగులైంది. అక్కడినుంచి లేచి వొక స్నేహితుని ఇంటికి వెళ్లాడు, మనశ్శాంతికోసం. అక్కడకు వెళ్లేసరికి స్నేహితుడూ, అతడి భార్య వరండాలో కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ విరగబడి నవ్వుకుంటున్నారు. ఆదృశ్యం చూడగానే ప్రకాశరావుకి గడచిపోయిన మధురక్షణాలు కళ్లముందు మెదిలినట్లైంది. అతడికాదృశ్యం యెంతో ఇంపుగావుంది. కదల్చి వేసింది.

స్నేహితుడు యెదురువచ్చి తీసుకెళ్ళాడు. ఆ అమ్మాయి లోపలికి వెళ్ళింది. కాసేపు రేడియో విన్నారు. కాసేపు కబుర్లుచెప్పుకున్నారు. ప్రకాశరావుకి ఎన్నికబుర్లు చెబుతున్నా యేమిటో మనసుకి దిగులుగానేఉంది. సినిమాకు వెళదామన్నాడు స్నేహితుడు. అక్కడే ఫోంచేసి రెండోఆట సినిమాకు బయలుదేరారు. సినిమాలో కూర్చున్నాడన్న మాటేగాని ప్రకాశరావుకి మనస్సులో మనస్సు లేదు. సినిమా వదిలేసరికి వొంటిగంటపైనే అయింది.

స్నేహితుడికి వస్తానని చెప్పి రిక్షాలో కూర్చున్నాడు ప్రకాశరావు. ఇంటిసంగతి వూహించుకునేసరికి అతడికి భయమైంది. ఒక్కడూ...నిద్రపట్టకపోతే తోచిచావదు.

రిక్షాదిగి భారంగా ఇంట్లోకి వెళ్ళాడు. తాళంతీసి లోపలకు వెళ్లాలి. వరండాలోకి అడుగు పెట్టాడు, చీకట్లో ఒకమూల యెవరో నిట్టూర్పటం విన్నాడుతను. అతడి గుండె లాగిపోయినంత పనైదివ. లైటు వేద్దామనీ తోచలేదు.

"ఎవరూ?" అన్నాడు.

"ఇప్పటికి వచ్చారా—"

అతడికెంతో సంతోషమైంది. సరస్వతి; ఎలా మాట్లాడుతుందో అతడికర్థం కాలేదు.

'నువ్వెలా వచ్చావు?'

'మీరలాపోగానే, ఊరికి వెళ్ళ లేననిపించింది. వెంటనే దిగాను, వచ్చేశాను. అవునండీ...నేను లేకపోతే ఇంతేగదా, మీరు, భోజనం చెయ్యలేదు. నిజం చెప్పండి, దిగులుతో యే పార్కులోనో యింతసేపూ గడిపారు. మంచిపనైంది. పాపిష్టిదాన్ని, నేను వచ్చేశాను. భగవంతుడు నాకు మంచిబుద్ధే పుట్టించాడు ఎప్పుడూ మీ మనస్సు నొప్పించనండీ...'

చీకట్లోనే ఆమె యేడుస్తోందని అతడికి తెలిసింది. అతడికళ్ళ నీళ్లు నిండాయి.

ఆమె యెదురుగా నడిచింది.

దగ్గరగా వచ్చింది.

అతడు దగ్గరగా తీసుకున్నాడు ఆమెని. ★